# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

-  అకాల వర్షాలతో రాష్ట్రంలో సంభవించిన పంట నష్టంపై అంచనాలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
-  శ్రీకాకుళం జిల్లాలో రైల్వే రవాణా వ్యవస్థను మరింత విస్తృత పరుస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
-  గృహ అవసరాలకు సంబంధించి వంట గ్యాస్ కొరత లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.
-  ప్రజల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.

====================

అకాల వర్షాలతో రాష్ట్రంలో సంభవించిన పంట నష్టంపై రెండు రోజుల్లో పూర్తి స్థాయి అంచనాలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు సమీక్ష నిర్వహించారు. 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో ఉద్యాన పంటలపైనా వర్షాలు ప్రభావం చూపాయన్నారు. అరటి, బొప్పాయి, మిరప, కూరగాయలు, మామిడి, ఆరెంజ్, నిమ్మ పంటలు దెబ్బతినగా.. నష్టం విలువ 23 కోట్ల రూపాయలుగా అంచనా వేసినట్లు పేర్కొన్నారు.

====================

శ్రీకాకుళం జిల్లాలో రైల్వే రవాణా వ్యవస్థను మరింత విస్తృత పరుస్తామని కేంద్ర పౌర విమానయన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. జిల్లాలోని కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ లో విశాఖ - గుణపూర్ పాసింజర్ రైలు హాల్ట్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలసి ఆయన ఈరోజు ప్రారంభించారు. అదేవిధంగా మందస రోడ్ రైల్వేస్టేషన్ లో బెర్హంపూర్ విశాఖపట్నం ఎక్స్ ప్రెస్ ను, పాతపట్నంలో రూర్కెల-గుణపూర్ ఎక్స్ ప్రెస్ ల నూతన హాల్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, హరిశంద్రపురం రైల్వే స్టేషన్ లో ట్రైన్ హాల్ట్ ద్వారా స్థానిక రైతులకు, మహిళలకు, విద్యార్థులకు మేలు జరుగుతుందని అన్నారు. ప్లాట్ ఫాం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, స్టాపేజి వంటివి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ...

(వాయిస్...24 సెకన్లు)

అలాగే.. రైల్వే జోన్ ను విశాఖలో త్వరలో ప్రారంభిస్తామని కూడా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు.

====================

రాష్ట్రంలో ఎక్కడా గృహ అవసరాలకు సంబంధించిన వంట గ్యాస్ కొరత లేదని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, జాయింట్ కలెక్టర్లు, ఉన్నతాధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా విజయవాడలో ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆయిల్ కంపెనీల్లో గ్యాస్ నిల్వలు తగినంతగా ఉన్నాయని తెలిపారు. గృహ అవసరాల గ్యాస్ పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాణిజ్య అవసరాలకు ప్రాధాన్యతల ప్రకారం సరఫరా చేయాలని సూచించారు. గ్యాస్ సరఫరాలో అపోహలు, ఆందోళలకు తావివ్వొద్దని, ప్రజల్లో అనవసర భయాలను తొలగించాలని అధికారులను ఆయన కోరారు.

=====================

ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో సుమారు 17 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన 100 పడకల అత్యాధునిక ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఆసుపత్రి ద్వారా సాలూరుతో పాటు పాచిపెంట, మక్కువ, రామభద్రపురం మండలాల్లోని సుమారు లక్ష మంది గిరిజన ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ...

(వాయిస్...18 సెకన్లు)

=====================

విరామం

=====================

దేశంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఏకలవ్య విద్యాలయాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్య తెలిపారు. వివిధ శాఖల అధికారులతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రం నెల్లూరులో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలను వెచ్చిస్తోందని చెప్పారు. ఆయా పథకాలను గిరిజనులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి గిరిజన సమస్యలపై త్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

=====================

ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు ప్రాంతాలలో గంజాయి సాగు రవాణాను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పాడేరు డిఎస్పి అభిషేక్ వెల్లడించారు. పాడేరులోని జిల్లా పోలీస్ శాఖ సమావేశ మందిరంలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ, ఒరిస్సా పోలీసులతో సంయుక్త తనిఖీలు నిర్వహించి జిల్లాలో గంజాయి రహిత సమాజానికి కృషి చేస్తున్నామని అన్నారు. అదే విధంగా ఒరిస్సా సరిహద్దుల నుండి అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించిన పలు రహదారులను గుర్తించి నిఘా వ్యవస్థను బలోపేతం చేశామని చెప్పారు. జిల్లాలో గంజాయి రవాణా, సాగు చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని డిఎస్పి అభిషేక్ హెచ్చరించారు.

=====================

కేంద్రప్రభుత్వ నిధులతో రాష్ట్రంలోని ప్రధాన జిల్లాలలో 14 క్రీడా వికాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు. తిరుపతిలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. కేంద్రప్రభుత్వ నిధులతో రాజమండ్రి, శ్రీకాకుళం, కుప్పంలలో మల్టీపర్పస్ స్టేడియం, టెక్కలి, తణుకు, నర్సీపట్నంలతో పాటు ఇతర ప్రాంతాల్లో క్రీడా వికాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

=====================

బాపట్ల జిల్లాలో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో DPO, గృహ నిర్మాణ సంస్థ PDలతో గృహ నిర్మాణాలపై దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష సమావేశాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గృహ నిర్మాణంతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

=====================

రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం పట్ల విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా పెట్టిన పోస్టులో ఆయన రాష్ట్రంలో 10,060 పోస్టులను భర్తీ చేసేందుకు తేదీలను ప్రకటిస్తూ స్పష్టమైన, పారదర్శకమైన నోటిఫికేషన్లు, క్రమబద్ధమైన విధానంతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశారని పేర్కొన్నారు.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 132వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 27వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

====================

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి కొనసాగుతోందని అమరవతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకటరావు తెలియజేస్తూ...

(వాయిస్…30 సెకన్లు)

====================

రాష్ట్రంలోని యువతకు 20 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని గనులు భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

====================
====================